క్లుప్తంగా

వైభవంగా తాళ్లమ్మ తీర్థం



తాళ్లమ్మ అమ్మవారికి కానుకలు సమర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి దంపతులు

రామచంద్రపురం: స్థానికంగా వేంచేసి ఉన్న తాళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి జాతర, ఆదివారం ఉదయం తీర్థం జరిగింది. రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో పిల్లా వీరవెంకట సత్యనారాయణమూర్తి, పిల్లా సూర్యప్రకాశరావుల కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెదురుపాకలో గీతాయజ్ఞం



గీతా యజ్ఞం చేస్తున్న అర్చకుడు

రాయవరం: వెదురుపాకలో ఆదివారం గీతా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. స్థానిక గీతా జ్ఞాన మందిరం వద్ద గత 18 ఆదివారాలుగా భగవద్గీతలోని ఒక్కో అధ్యాయాన్ని పారాయణ చేశారు. 18 వారాలు పూర్తయిన సందర్భంగా గీతా మందిరంలో కొలువైన శ్రీకృష్ణ భగవానుడికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సత్తి విజయభాస్కరరెడ్డి, స్వాతి దంపతులు యజ్ఞకర్తలుగా పీఠలపై కూర్చుని శాస్త్రోక్తంగా యజ్ఞాన్ని జరిపారు. లోక కల్యాణార్థం అంగర జనార్దనాచార్యుల అర్చకత్వంలో యజ్ఞక్రతులను నిర్వహించినట్లు గీతా మందిరం నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు, సత్సంగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

కాజులూరు: రాజమహేంద్రవరం డిపో నుంచి మంజేరుకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం, ద్రాక్షారామ మండలం కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడల మీదుగా రోజూ ఒక బస్సు నాలుగు పర్యాయాలు మంజేరుకు వచ్చి వెళ్లేదన్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో నిలిపివేసిన ఈ సర్వీసును తిరిగి తిప్పాలన్నారు. ఈ మేరకు అధికారులు స్పందించాలని మంజేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గండి కిశోర్, చేదువాడ సర్పంచ్ గంజా దేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ చైర్మన్ గంజా సూరిబాబు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తదితరులు కోరారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ



ఏడిదలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మండపేట: మణిపూర్‌లో ఘటనలను నిరసిస్తూ ఆదివారం ఏడిదకు చెందిన హోలీ ట్రినిటి లూథరన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అమాయక ప్రజలపై దాడులను అరికట్టాలని, శాంతి స్థాపనకు అక్కడి పాలకులు కృషి చేయాలని ఏడిద మెయిన్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ యావత్ ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. విద్వేషాలు విడనాడి ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



జి.మామిడాడలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటైంది.



వీధివారిలంక శివారులో కొబ్బరికాయలను పడవపై ఒడ్డుకు చేర్చుతున్న రైతులు, ప్రభుత్వ సిబ్బంది



కోటలో అరటి తోటల్లోకి చేరిన వరద నీరు



కోటిపల్లి మత్స్యకార కాలనీలో ఇళ్ల వద్ద ఇలా..

గోదావడి... లంకల్లో అలజడి

- ముంచెత్తిన వరద నీరు
- సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం
- సేవల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



వానపల్లి - అద్దంకివారిలంక కాజ్‌వేపై చేరిన వరద

కపిలేశ్వరపురం: ఉరకలేస్తూ.. ఉగ్రరూపం దాల్చుతూ.. గోదావరి పరుగులు పెడుతోంది. లంకలను ముంచెత్తుతోంది. గంట గంటకూ పెరుగుతున్న వరద నీటితో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని లంక గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. కపిలేశ్వరపురం మండలంలోని పలు కాజ్‌వేలు నీట మునిగాయి. వాడపాలెం - నారాయణలంక, కొత్తపేట-కేదారిలంక, వానపల్లి-అద్దంకివారిలంక గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కాజ్‌వేలపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. వ్యవసాయ క్షేత్రాలు పూర్తిగా ముంపు నీటిలో చిక్కుకున్నాయి. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పర్యవేక్షణలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది లంక గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నారు. పంట పొలాల్లో ఉండిపోయిన వ్యవసాయ ఉత్పత్తులను పడవలపై ఒడ్డుకు చేర్చుతున్నారు. పశువులను గ్రామాల్లో తీసుకొచ్చారు. పాడి పశువులు, గొర్రెలకు పశువుల దాణా సరఫరా చేస్తున్నారు. గోదావరి నిండుకుండలా మారడంతో కేదారిలంక, వీధివారిలంక, పల్లపులంక, అద్దంకివారిలంక, నారాయణలంక గ్రామాల వీధుల్లోని వాడకం నీరు ఎటూ కదలడం లేదు. దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లుతూ సమస్య లేకుండా చూస్తున్నారు. పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వాడపాలెం, వానపల్లి, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను నిర్దేశిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులంతా లంక గ్రామాల ప్రజల సేవల్లో నిమగ్నమయ్యారు. వలంటీర్లు గోదావరి గట్టు పరిరక్షణ విధులను నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా సంసిద్ధమై పని చేస్తుందని తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. విపత్తుల సమయంలో తమకు అండగా నిలుస్తున్న అధికార యంత్రాంగానికి ఆయా గ్రామాల సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, లంక గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అంతకంతకూ పెరుగుతూ..

కె.గంగవరం: రెండు రోజుల నుంచి గంట గంటకూ పెరుగుతూ వరదనీరు చుట్టుముట్టడంతో మండలంలోని లంక గ్రామాల, గోదావరి పరీవాహక ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొంది. బ్రహ్మపురి వద్ద గోశాల పూర్తిగా వరదనీటిలో చిక్కుకుంది. దీంతో గోశాలలోని ఆవులు, దూడలను గట్టుకు చేర్చారు. కోటిపల్లి గ్రామంలోని మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట మూడు వీధుల్లోకి వరద నీరు చేరింది. గోదావరి ఒడ్డునే ఉన్న పూరిళ్ల వద్దకు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 100 పూరిళ్లలోని వరద నీరు రావడంతో వారు పక్కనే ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్తున్నారు. కొందరు ఆ వరదలోని ఇళ్లల్లోనే ఉండిపోయారు. కూళ్ల నుంచి మసకపల్లి వరకూ ఏటిగట్టు వెంబడి రైతులు పండిస్తున్న ఉద్యాన పంటలు నీటమునిగాయి. సుమారు 3 వేల ఎకరాల్లోని కొబ్బరి, అరటి, బొప్పాయి, కూరగాయ తోటలు ముంపు నీట ఉన్నాయి. దీనివల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. బొప్పాయి, అరటి, కూరగాయల మొక్కలు వరద నీటిలో కుళ్లిపోయాయని వారంటున్నారు. కోటిపల్లి మత్స్యకార కాలనీ వాసులకు అక్కడి ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు. పునరావాస కేంద్రంలో సుమారు 300 మందికి రెవెన్యూ సిబ్బంది భోజనాలు వడ్డిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పునరావాస కేంద్రం వద్ద ఉండి బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా న్నారు.

అప్రమత్తంగా ఉండండి

కాజులూరు: వరద ఉధృతి నేపథ్యంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని పెద్దలంక, కోలంక తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చెయ్యాలని తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ సూచించారు. కోలంకలో ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా గోదావరి నీటిమట్టం పెరుగుతుందన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట గండ్లు పడకుండా పటిష్టం చేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తుందన్నారు. వరద నీరు తగ్గుముఖం పట్టే వరకూ స్థానిక రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



మల్లవరం ఇటుక బట్టీలోకి చేరిన నీరు



కేదారిలంకలో వరదనీటిలో పాడి పశువులు



కోటిపల్లి ఫైండా సత్రం ఆధ్వర్యంలో పునరావాస కేంద్రం వద్ద బాధితులకు ఆహారం పంపిణీ

రోడ్డు రేగ్గొట్టేస్తున్నారు..

రంగంపేట: నిత్యం మనం వెళ్లే రోడ్డే అది. అయినా అడిగేవారు ఉండరు. కనీసం పట్టించుకోరు. ఫలితంగా కొందరికి ఇష్టారాజ్యం అయ్యింది. దమ్ము ట్రాక్టర్లతో ఎటువంటి రక్షణ లేకుండా నేరుగా రోడ్డుపైకి వస్తున్నారు. ఇలా రహదారులకు తూట్లు పొడుస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రంగంపేట మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పంట చేలలో దమ్ములు చేసిన తర్వాత ట్రాక్టర్లను నేరుగా దమ్ము చక్రాలతో రోడ్లపైకి తీసుకొస్తున్నారు. ఈ సమస్య ప్రధానంగా రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు గ్రామాల్లో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న ఈ వాహనాలతో రోడ్లు పొరలు, పొరలుగా లేచిపోతున్నాయి. ఈ దమ్ము ట్రాక్టర్ల ధాటికి రహదారిపై గోతులు పడటంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఇలా చేయాలి..

పంట పొలాల్లో తమ పనులు పూర్తయిన తర్వాత దమ్ము ట్రాక్టర్లను రోడ్లపై నడపాల్సి వస్తే దమ్ము చక్రాలకు ఇనుప బద్దెను అమర్చాలి. కానీ దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక ఇనుప బద్దె ఏర్పాటుకు రూ. 3 వేల వరకూ ఖర్చవుతుంది. ట్రాక్టర్ యజమానులకు అది స్వల్ప మొత్తమే అయినా గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రంగంపేటలో రోడ్డుపైకి వచ్చిన దమ్ము చక్రాల ట్రాక్టర్

వ్యాపిస్తున్న కళ్ల కలక



రామచంద్రపురం రూరల్: కళ్ల కలక వ్యాధి అంతటా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈ బాధితులు కనిపిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఇప్పటికే అనేకమందికి కళ్ల కలక సోకింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఎక్కువగా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ వ్యాధి రాకుండా హోమియో మందులు ముందస్తుగా వాడడం ద్వారా నివారించవచ్చని ద్రాక్షారామ హోమియో వైద్యశాల వైద్యాధికారి ఎం.విజయ ప్రతిభ తెలిపారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ, కె.గంగవరం మండలం కోటిపల్లి, రామచంద్రపురం మున్సిపాలిటీలో ఒకటి, మండపేట మండలం తాపేశ్వరం, రాయవరం మండలం వెంటూరు గ్రామాల్లో హోమియో వైద్యశాలలు ఉన్నాయి. దగ్గరలోని హోమియో వైద్యశాలల్లో మందులు తీసుకుని రోజుకి ఒక్కసారి చొప్పున మూడు రోజులు వాడితే కళ్ల కలక దరిచేరదని డాక్టర్ విజయ ప్రతిభ తెలిపారు. వ్యాధి బారిన పడిన బాధితులు నేరుగా వైద్యులను సంప్రదించి, వారు ఇచ్చిన మందులను రోజుకు రెండుసార్లు చొప్పున ఐదు రోజులు వాడితే త్వరగా కళ్ల కలక తగ్గుతుందన్నారు.

సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు: పాశర్లపూడి శివాలయం వద్ద ఆదివారం సామూహిక సత్యసాయి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరించారు. పాశర్లపూడి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కాకినాడకు చెందిన రఘుపతి మాస్టర్ బ్రహ్మత్వంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ర్యాలిలో నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి అన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పోలంరాజు అమరేశ్వరరావు–మాధవి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చేతుల మీదుగా అందజేశారు.

కొప్పిశెట్టి కుటుంబానికి మంత్రి పరామర్శ



ఉండూరులో సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో ఈ నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉండూరుకు చెందిన కొప్పిశెట్టి సూర్యనారాయణ (60) మృతిచెందగా, ఆ కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. సూర్యనారాయణ భార్య నాగమణి, పిల్లలు పద్మావతి, దుర్గాభవాని, ఏడుకొండలులను ఓదార్చారు. గ్రామ పెద్దలు కొప్పిశెట్టి సత్తిరాజు, వెంకట్రావు, వీరభద్రరావు, అనుసూరి రాంబాబు, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఉండూరు పీఏసీఎస్ చైర్మన్ దంగేటి చినబాబు, తాళ్లపాలెం సర్పంచ్ కట్టా గోవిందు పాల్గొన్నారు.

ఈలకర్రలు, ఇసుక బస్తాలతో నదీకోతకు అడ్డుకట్ట



నదీకోతకు గురికాకుండా సర్వే బాదులు, ఇసుక బస్తాలు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో నదీపాయ వెంబడి శీలంవారిపాలెం వద్ద ఐదు నివాస గృహాలు ఉన్నాయి. ఈ గృహాల వద్ద గోదావరి నదీపాయ ఉధృతిగా ప్రవహించడంతో కోతకు గురై నదిలో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో శనివారం మండలం పర్యటనలో భాగంగా కొండుకుదురు వచ్చిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఈ నదీ కోతకు గురవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. వెంటనే కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్లో మాట్లాడి విషయాన్ని తెలిపారు. ఆయన తక్షణమే హెడ్ వర్క్స్ అధికారులకు సమస్యను వివరించారు. వెంటనే వారు సర్వే కర్రలు, ఇసుక మూటలతో నది ఒడ్డు కోతకు కాకుండా రక్షణ చర్యలు చేపట్టారు. ఈ పనులను జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య అధికారులు పర్యవేక్షించారు.

యాదవ్ నియామకంపై హర్షం

మండపేట: బీజేపీ జాతీయ కార్యదర్శిగా రాష్ట్రానికి చెందిన వై.సత్యకుమార్ యాదవ్ నియామకం పట్ల ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతకు ఆయన పనిచేస్తారని సత్యనారాయణ అన్నారు.

అన్నీ మంచి శకునములే..

- ముమ్మరంగా ఖరీఫ్ పనులు
- 73 శాతం నాట్లు పూర్తి



వరి నాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: అంతా బాగుంది.. వాతావరణం అనుకూలించింది.. రైతన్నలు సాగు బాట పట్టారు.. ఖరీఫ్ వరి నాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నెలాఖరులోగా నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సూచనలతో పనులు ముమ్మరం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగును రైతులు ముందుగానే ప్రారంభించారు. నీటిపారుదల శాఖ జూన్ 1వ తేదీనే కాలువలకు నీటిని విడుదల చేసింది. బోర్లపై సాగు చేసేవారు ముందుగానే వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం గ్రామాల్లో రైతులు వరి సాగు చేపడుతున్నారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాల పరిధిలో 73 శాతం వరకు నాట్లు పూర్తయ్యాయి. ఈ రెండు రోజుల్లో మిగిలిన నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ.. ఎంతెంత

రెండు నియోజకవర్గాల పరిధిలో 82,020 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 16,154 ఎకరాల్లో వెదజల్లు విధానంలో రైతులు సాగు చేపట్టగా, 43,465 ఎకరాల్లో సాధారణ పద్ధతిలో నాట్లు వేశారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో నాట్లు ఊపందుకుంటున్నాయి. అధికంగా ఎంటీయూ 7029 (స్వర్ణ) రకాన్ని 90 శాతం మంది వేయగా, మిగిలిన 10 శాతం ఎంటీయూ 1318, ఎంటీయూ 1064 రకాలను వేస్తున్నారు. రబీలో విత్తనాల కోసం ఎంటీయూ 3626 (బొండాలు) రకాన్ని అతి తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

మండలం	విస్తీర్ణం	వెదజల్లు	ఊడ్పులు
రాయవరం	14,641	6526	6954
కపిలేశ్వరంపురం	16,102	5285	7052
మండపేట	16875	835	13081
రామచంద్రపురం	18713	1850	12270
కె.గంగవరం	15,689	1658	4108

వెదజల్లుకు ప్రాధాన్యం

సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేసుకోవడం కన్నా వెదజల్లుకే ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. వెదజల్లు విధానంలో సాగు చేయడం వల్ల సమయం ఆదా కావడమే కాకుండా పంట దుబ్బు చేసుకుని తెగుళ్లను తట్టుకుంటుంది. దీంతో రైతులు కూడా వెదజల్లు సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు. సాధారణ వరినాట్లు వేసే రైతులు 70 శాతం మంది బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయించగా, మన ప్రాంతం, కృష్ణా జిల్లా కూలీలతో 30 శాతం మేర చేపట్టారు.

ముంపునకు గురైన పొలాల్లో..

ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. అలాంటి పొలంలో యూరియాతో పాటు పొటాషియం కూడా వెయ్యాలి. నారు మడుల్లో ముంపు నీటిని తీసివేసి, ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో పొటాష్ వేయాలని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా 20 రోజులు వయసున్న ఆకుమడికి రెండు మి.లీ క్లోరిపైరిఫాస్, ఒక గ్రాము బావిస్టిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ప్రధాన వరి నాట్లు వేసిన పొలాల్లో 20 కిలోల యూరియాతో పాటు 15 కిలోల పొటాష్ వేసుకోవాలి. దీనివల్ల బలహీనపడిన మూన దృఢంగా తయారు కావడానికి, చీడపీడల నుంచి తట్టుకునే అవకాశముంటుంది.

అనుకూలంగా వాతావరణం



ఖరీఫ్ వరి నాట్లకు వాతావరణం అనుకూలించింది. ఎక్కడికక్కడే వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నెలాఖరుకు పూర్తి స్థాయిలో వరినాట్లు పూర్తయితే పంట త్వరగా చేతికొస్తుంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకునే అవకాశముంటుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం